# స్నేహితులు

శ్రీమతి పి. సుభద్రాకుమారి

★

రాధ జమీందారు కూతురు. లలిత ఆ యూళ్లోనే రంగనాథంగారి కుమార్తె. అయితే రంగనాథంగారికి ఆరుగురు ఆడపిల్లలగుటచేత, మగ సంతానం లేకపోవడంచేత లలితకు చిన్నప్పటినుండి పిల్లవాని దుస్తులతో ముస్తాబుచేసి అల్లారుముద్దుగా పెంచేవారు. లలిత, రాధ చిన్నప్పటినుండి ఒక స్కూలులోనే చదువుకుంటూ ఆప్త మిత్రులుగా మెలగేవారు. రంగనాథంగారి అమ్మాయికి లలిత యని నామకరణం చేసినా యింటిల్లిపాది సుందర్! అని పిలుస్తూ యుండేవారు. స్కూలులోకూడ సుందర్ అనే పిలచేవారు. ఇద్దరూ స్కూలు ఫైనలు పరీక్ష పాసయినారు. రంగనాథంగారి అమ్మాయి మాత్రం పెద్ద చదువులకని మద్రాసుకు వెళ్ళింది. జమీందారు రాధకు యీడుజోడు చూచి సుధాకర్‌కు యిచ్చి వివాహం చేశారు. కొంతకాలానికి ఆమె అత్తగారింటికి వెళ్ళింది.

ఒకరోజున రాధ కాఫీ తయారుచేసి హాలులో కూర్చొనియున్న సుధాకర్‌కు తెచ్చింది. సుధాకర్ ఏదో కాగితం చదువుతూ ఆమె వంకైనా చూడ్డలేదు. రాధ అలాగే చాలసేపు నిలబడి "కాఫీ చల్లారిపోతున్నది - దాన్ని సావధానంగా చదువుకోకూడదూ!" అన్నది కాఫీకప్పు యున్న బల్లను ముందుకు జరుపుతూ. సుధాకర్ ఏమీ మాట్లాడకుండా కాగితమును మడిచి జేబులో పెట్టుకొని లేచి వెళ్ళిపోయాడు. ఆనాటినుండి సుధాకర్‌లో మార్పువచ్చింది. సరిగ్గా మాట్లాడడు - ఏదో తిన్నపూట నాలుగు మెతుకులు తిని పరాయివాడిలాగ పరగళ్ళ పరగళ్ళ తిరుగసాగాడు. రాధకు యిదంతా అయోమయంగా నుండింది.

ఒక ఆదివారంనాడు పుస్తకాలు' గుడ్డలు విదిలించి సర్దుకుంటుంటే అందులోనుండి ఒక ఫొటో క్రిందపడింది. అది చూచేసరికి దానివెనుక ప్రేమతో 'సుందర్' అని యుంది. సుధాకర్ కండ్లు భ్రమించినవి. అనుమానం బలపడింది. శీలాన్ని శంకించాడు. రాధ అతని కండ్లకు నీచంగా కనుపించింది. ఏ విధంగానైనా ఆమెను పుట్టింటికి పంపివేయదలచాడు. తన కామెతో సాంగత్యము పనికిరాదనుకున్నాడు. రాధ మూడు మాసముల గర్భిణి యని తెలియగానే పుట్టింటివారు వచ్చి పిలుచుకొని పోకపోయినా తనే ఆమెను పంపేసి, కనీసం జాబైనా వ్రాయడం మానేశాడు. రాధ భర్తవైఖరికి కలవరపాటు చెందింది. తను ఎన్నో జాబులు వ్రాసింది. తండ్రిచేత, తమ్ములచేత వ్రాయించింది కాని సుధాకర్ మాత్రం జాబూ వ్రాయలేదు - ఒక్కసారైనా వచ్చి చూచిపోలేదు. నవమాసాలు నిండి పండంటి మగబిడ్డను కన్నది రాధ. అందరూ చూచి ముచ్చట

పడ్డారు కాని సుధాకర్ మాత్రం వచ్చి చూశ లేదు.

సుధాకర్ జీవితం పిచ్చివానిలాగైంది. హోటలులో తిని, అక్కడక్కడ తిరిగి ఎప్పుడో వచ్చేవాడు. ఆఫీసుకైనా తప్పని సరిగా వెళ్ళవలసి వచ్చిందే అన్నట్లు వెళుతుండేవాడు. స్నేహితులు, బంధువులు అతనిలోని మార్పును గుర్తించి కారణం అడిగినా బదులు చెప్పేవాడు కాడు. క్రమంగా మానసిక బాధతో ఆరోగ్యాన్ని సయితం కోల్పోయాడు.

బాగా జ్వరం తగిలియుంది. తనొక్కడే గది తలుపేసుకొని లోపల దుప్పటి కప్పుకొని పండుకొనియున్నాడు. ఇంతలో ఎవరో రాధా! రాధా! అని పిలుస్తూ తలుపు తట్టారు. ఎవరో - స్త్రీ కంఠంలాగున్నది. సుధాకర్ మెల్లగా లేచివెళ్ళి తలుపు తీశాడు.

"రాధ లేదండీ!"

"లేదు. పుట్టింట్లో యున్నది. మీరు ఆమెతో ఏదో పనియుండి వచ్చినట్లున్నది!" అన్నాడు కటువుగా సుధాకర్.

"పని అంటూ ఏమిలేదు కాని మేమిద్దరం బాల్యస్నేహితులం. చూచి పోదామని .."

"ఓహో! అలాగా! మీ పేరేమిటో...."

"నాపేరు సుందర్. మా నాన్నగారు మగసంతానం లేక నాకు సుందర్ అని పేరుపెట్టి పిలుస్తూ మగదుస్తులతోనే ముస్తాబుచేసి మోజుపడేవాడు."

"అంటే.. సుందర్ మీరేనా! రాధకు రెండు మూడు జాబులుకూడ వ్రాసినట్లున్నది..."

"అవునండీ! ఒక్క జాబుకైనా ఆమె జాబు వ్రాసింది కాదు" అన్నది కొద్దిగా కోపంతో.

సుధాకర్ తన పొరబాటుకు, అపోహలకు నాలిక కొరుక్కున్నాడు.

"హోటలునుండి కాఫీ, టిఫెను తెప్పించి పెడతాను ఉండండి" అంటూ కుర్చీ చూపించి కూర్చోమన్నాడు.

"ఏమీ వద్దండీ! - మీరూ ఏదో నుస్తీగా నున్నట్లున్నదే" అన్నది లలిత.

సుధాకర్ మనిషిని పంపి కాఫీ, టిఫెను తెప్పించాడు. తనూ ఆమెతోబాటు కొద్దిగా కాఫీ త్రాగి ఆమెను సాగనంపాడు.

రాధ తనభర్త రాకపోయినందులకు పరిపరివిధాల ఆలోచనలతో దిగులుగా నుండేది. ఒకరోజున లలిత ఆమెను చూడడానికని వెళ్ళి పిల్లవాణ్ణి ఎత్తుకొని ముద్దాడింది. ఇంటిల్లిపాది సంతోషపడ్డారు కాని రాధ ముఖముమీది విషాదఛాయలు లలితను కలవరపరిచినవి. కారణమడిగి తెలిసికోవాలని విశ్వప్రయత్నం చేసింది కాని ఏమి లాభం లేకపోయింది. లలిత రాధతోబాటు యుండి పదిరోజులు గడుపదలచింది. ఉన్నట్లుండి ఒకరోజు సాయంకాలం సుధాకర్ వచ్చి టాక్సీ దిగాడు. అతనిని చూచి రాధ ముఖం వికసించింది. రాధ తల్లిదండ్రులు ఆనందపరవశులయ్యారు. బావమరుదులు "బావగారు

దారితప్పి యింటికి వచ్చినట్లున్నది'' అని చెప్పిపోడిచారు.

రాత్రి భోజనాలయాక రాధ, లలితలను చూచి సుధాకర్ వంచినతల పైకెత్తలేక పోయాడు. రాధ తమలపాకులు చీల్చి సున్నం రాయుచూ ''ప్రభువులకు యీనాటికి దయ కలిగినట్లున్నది!'' అన్నది.

''రాధమీద పగ పూనారట ఏమిటి సుధాకర్‌గారూ!'' అన్నది లలిత.

''అయినా, నా రాధ నన్ను క్షమిస్తుందిగా!'' అన్నాడు మెల్లగా లలితవంక చూస్తూ సుధాకర్.

''క్షమించడమేమిటండీ! అసలేమిటీ గొడవ?'' అన్నది లలిత.

''మీరొకప్పుడు వ్రాసిన జాబు చూచి రాధకు ఎవరో పరాయి పురుషునితో సంబంధమున్నదని అపోహపడ్డాను. దాంతోబాటు పురుష దుస్తులలోనున్న మీ ఫొటో - వెనుక ప్రేమతో 'సుందర్' వ్రాసియున్నది రాధ పుస్తకాలలో నుండి బయటపడింది. ఇవి రెండు రాధను అపార్థం చేసికొనేట్లు చేసినవి. దాంతో విరక్తి కలిగి రాధను పంపేసి యింతకాలంనుండి చూడడానికైనా రాలేదు. మీ మూలంగా అసలు విషయం తెలిసింది. పశ్చాత్తాపంతో పరుగెత్తుకుంటూ వచ్చాను. మరి రాధ అనుగ్రహిస్తుందో లేదో...''

రాధ కండ్లలో నీళ్లు గిర్రున తిరిగాయి. వెక్కి వెక్కి ఏడ్వసాగింది. లలిత ''ఏమిటిది! పిచ్చిపిల్లా! చూడు పాపాయి నిన్ను చూచి బిక్కమొగం పెట్టాడు'' అన్నది.

రాధ, సుధాకర్‌లతో కులాసాగా కొన్నిరోజులు గడిపి తమ యూరికి వెళ్ళిపోయింది లలిత.


కేసరిగారి

శ్రీ ఫలాది పానకం

గర్భమునందు, నోటియందు పేగుజబ్బులవల్ల, యితర కారణములవల్ల పుండగుట, చీము నెత్తురుతో మలము వెలువడుట, నీళ్ల విరేచనములను నివారించును. గ్రహిణిజబ్బులు, అతిసారము, కడుపునొప్పితోకూడిన జిగట విరేచనములను నమ్మకముగా కుదుర్చును.

వెల రు. 1.60

కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్
మద్రాసు - 14.






అన్ని నొప్పులకు

అమృతాంజనము